క్లుప్తంగా

కోవూరి శ్రీనివాస్ స్మారక జాతీయ కార్డు కథల పోటీ

విజయవాడ కల్చరల్: రమ్యభారతి సాహిత్య మాసపత్రిక ఆధ్వర్యంలో కోవూరి శ్రీనివాస్ స్మారక జాతీయ కార్డు కథల పోటీ నిర్వహిస్తున్నట్లు రమ్యభారతి సాహిత్య మాస పత్రిక సంపాదకుడు చలపాక ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక స్పృహ కలిగిన ఏ అంశం మీదైనా పోస్ట్ కార్డు మీద మాత్రమే రాయాల్సి ఉంటుందని వివరించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.1000, ద్వితీయ బహుమతి రూ.500, తృతీయ బహుమతి రూ.200 అని, నగదును ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా అందజేస్తామని ఆయన తెలిపారు. కథలను అక్టోబర్ 31 వ తేదీలోపు రమ్యభారతి మాసపత్రిక, పోస్ట్‌బాక్స్ నెం: 5, విజయవాడ 520001 చిరునామాకు పంపాలని కోరారు.

సిటీ బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్ గద్దే వెంకట్రామయ్య నగర్, దావు బుచ్చయ్యకాలనీలకు సిటీ బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ గత కొంత కాలంగా యూజీడీ, వాటర్ వర్క్స్, రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడకు రెగ్యులర్‌గా వచ్చే 3డీ, 20 సిటీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు తుదిదశకు చేరుకున్నాయని, భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సిటీ బస్సులు మాత్రం రావటం లేదని వారు వాపోతున్నారు. 3డీ బస్సును దేవీనగర్ ఎనిమిదో రోడ్డు వరకు మాత్రమే నడుపుతున్నారని, అక్కడ నుంచి సుమారు కిలోమీటరు దూరం నడిచి లోనికి వెళ్లాల్సివస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిటీ బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

బాబాకు తులసీదళాలతో లక్ష నామార్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో షిర్డీ సాయినాథుని 105వ పుణ్యతిథి మహోత్సవాలు శనివారం ఏడోరోజుకు చేరుకున్నాయి. బాబావారికి విశేషంగా లఘు న్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, పంచ సూక్త పఠనం జరిగింది. క్షీరము, కొబ్బరి నీరుతో బాబాకు అభిషేకం చేసి తులసీదళాలతో లక్ష నామార్చన చేశారు. లోక కల్యాణార్థం మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు సాయినాథ, మృత్యుంజయ హోమం వేదపండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

భక్తితో సేవిస్తే అమ్మవారి ఆశీస్సులు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): భక్తితో సేవిస్తే అమ్మవారి ఆశీస్సులు లభిస్తాయని, సకల కష్టాలు తీరుతాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక బావాజీపేటలో శనివారం శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదానం ప్రారంభించారు.

బాలసువాసినీల పూజ

శ్రీదేవీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బాలసువాసినీల పూజ జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి సుధీర, క్రాంతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ పర్యవేక్షించారు.

పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన రాష్ట్ర కన్వీనర్‌గా కర్రి రాఘవ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన రాష్ట్ర కన్వీనర్‌గా కర్రి రాఘవ నియమితులయ్యారు. ఈ మేరకు తనకు నియామక ఉత్తర్వులు అందాయని రాఘవ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకం ఉంచి కన్వీనర్‌గా నియమించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, జి.మధుకర్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ కనకదుర్గా..మనసా స్మరామి



శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో...



రామకృష్ణాపురంలో...



దుర్గాపురంలో...



శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో శ్రీ దుర్గాదేవిగా...



శివరామకృష్ణ క్షేత్రంలో ధనలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏడో రోజు శనివారం అమ్మవారు శ్రీదుర్గాదేవిగా పూజలు అందుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

- అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారిని శ్రీ శివకామేశ్వరీ అమ్మవారిగా అలంకారం చేసి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, చండీహోమం జరిగాయి. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.
- బావాజీపేట నాలుగోలైనులో శ్రీదేవీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ పర్యవేక్షణలో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు.
- దుర్గాపురంలో వీరమాచనేని లలిత ఆధ్వర్యాన శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.
- మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని శ్రీ లలితాదేవిగా అలంకరించి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.
- ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీ పార్వతీ దేవిగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.
- మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష, పెనుమత్స సత్యం ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు.
- రామకృష్ణాపురం దుర్గాదేవి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేశారు.



రామలింగేశ్వరపేటలో దుర్గాదేవిగా...

- రామలింగేశ్వర పేట శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు.



లబ్బీపేట చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో లలితా త్రిపుర సుందరి

- గద్దే వెంకట్రామయ్య నగర్‌లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.
- దావు బుచ్చయ్యకాలనీలో శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మహా రుద్రహోమం

విజయవాడ కల్చరల్: కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, విశ్వమాతా చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో శోభకృత్ దసరా మహోత్సవాల సందర్భంగా వేద పండితుడు నిడుమోలు రమాసత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం హనుమాన్‌పేట శంకరమఠంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని లలితా దేవిగా అలరించారు. దేవాలయంలో మహారుద్రహోమం, చండీ పారాయణం నిర్వహించారు.

- లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యహోమం, బలిహరణం, నవకుంభారాధన నిర్వహించారు. పార్వతీమాత లలితా త్రిపురసుందరిగా దర్శనమిచ్చింది.
- శివరామకృష్ణ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరిని లలితా దేవిగా, శారదాంబను మోహినిగా, మహాలక్ష్మిని ధనలక్ష్మిగా అలంకరించారు. దేవాలయంలో నిర్వహించిన కుంకుమ పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యమే లక్ష్యం

- అదే జగనన్న ఆరోగ్య సురక్ష ధ్యేయం
- సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వైద్య పరీక్షల అనంతరం మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలోని 24వ డివిజన్ సీతారామపురం నవోదయ స్కూల్ లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. అనంతరం వైద్య సేవలు అందుతున్న తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్పెషలిస్టు డాక్టర్ల పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. అనారోగ్యంతో ఎంతో మంది నిరుపేదలు సరైన వైద్యం అందక ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి వారికి ఉచిత వైద్యం, మందులు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోనే 71,982 కుటుంబాలకు గత నాలుగేళ్లలో రూ.160 కోట్లు విలువైన ఆరోగ్యశ్రీ సేవలు అందించినట్లు వెల్లడించారు. పేదలకు మెరుగైన వైద్యసేవల కోసం కొత్తగా నాలుగు యూపీహెచ్‌సీలు నిర్మించామని, మరో యూపీహెచ్‌సీ నిర్మాణ దిశగా ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు జగదీష్‌తో పాటు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరర్థక సొమ్మును వృద్ధుల సంక్షేమానికి కేటాయించాలి

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్



శ్రీరామచంద్రమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశవ్యాప్తంగా వివిధ బ్యాంకుల్లో ఎవరూ క్లెయిమ్ చేయని నిరర్థక సొమ్మును వృద్ధుల సంక్షేమానికి వినియోగించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేమూరు బాబూరావు కోరారు. శనివారం బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న వేమూరు బాబురావు మాట్లాడుతూ ఇటీవల పూనాలో జరిగిన సంఘం జాతీయ మహాసభల నిర్ణయాలను వివరించారు. బ్యాంకుల్లో నిరర్థక సొమ్మును వృద్ధుల సంక్షేమానికి కేటాయించాలని, రైల్వే ప్రయాణంలో వృద్ధులకు రాయితీలు కల్పించాలని, జాతీయ స్థాయిలో కుటుంబ పోషణ చట్టం అమలు చేయాలని కోరారు. అనంతరం ఇటీవల మరణించిన సంఘం సహాయ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో సంఘం కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, రిటైర్డు సంఘం నాయకులు బోస్, సంఘం సహాయ కార్యదర్శి డి.సాంబశివరావు, నాదెళ్ల సుమతి దేవి, తొండెపు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి





నగరంలో దసరా మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఏడో రోజైన శనివారం అమ్మ వారు లలితా త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఇంద్రకీలాద్రికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





ప్రజా దర్శకుడు టి.కృష్ణ



టి.కృష్ణ వర్ధంతి సభలో మాట్లాడుతున్న బలరామకృష్ణ మూర్తి

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, టి.కృష్ణ సాంస్కృతిక కళాపీఠం, మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దర్శకుడు టి.కృష్ణ 36 వర్ధంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఘటన, రేపటి పౌరులు, వందేమాతరం, దేవాలయం లాంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గోపీచంద్ ఫ్యాన్స్ అధ్యక్షుడు మరపాక రాంబాబు సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, ప్రభుత శ్రీనివాస్, ప్రసూనా రామన్, డి.వీరభద్రరావు, చావా నరసింహరావు తదితరులు పాల్గొన్నారు. టి.కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాటలను సుధారాణి, ఉమాబలరాం, విష్ణుప్రియ, రసూల్‌బాబు, పి.శ్రీనివాసరావు పాడి వినిపించారు. తొలుత టి.కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు ప్రకటించారు.

నేత్రపర్వంగా కూచిపూడి నృత్య ప్రదర్శనలు



కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారిణులు

విజయవాడకల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో కనక దుర్గానగర్‌లో నిర్వహిస్తున్న సాంస్కృతిక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. నాట్యాచార్యుడు సప్తా శివకుమార్ బృందం కూచిపూడి సంప్రదాయంలో శివకైవారం, గణేష కౌత్వం, థిల్లానా అంశాలను ప్రదర్శించారు. ఆంధ్రనాట్య నాట్యాచారిణి శారదా రామకృష్ణ కుంభహారతి, హైదరాబాద్‌కు చెందిన వై.విజయవల్లీ భరద్వాజ్ బృందం పార్వతీ కల్యాణం నృత్యరూపకాన్ని, అనన్య సీహెచ్ వీరభద్రరావు,బీహెచ్ శ్రావణి, సాయి సహస్ర, విశాఖపట్నానికి చెందిన టి.సందీప్ కుమార్ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. జగదాంబ భక్తి గీతాలను, గీతాకుమారి త్యాగరాజ స్వామి కృతులను ఆంజనేయులు భజన కీర్తనలను ఆలపించారు. కార్యక్రమాలను సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులు సైదా, గంగాధర్, రామకృష్ణ నిర్వహించారు.

ప్రైవేటు ట్రావెల్స్‌లో అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దసరా పండుగ రద్దీ దృష్ట్యా నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపినా, ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేసినా చర్యలు తప్పవని డీటీసీ ఎం.పురేంద్ర హెచ్చరించారు. రవాణా శాఖ అధికారులు శనివారం ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీటీసీ పురేంద్ర మాట్లాడుతూ.. విజయదశమి పండుగ సందర్భంగా దూరపు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి అధిక చార్జీలను వసూలు చేయడం, టికెట్ ధరలు పెంచడం సరికాదన్నారు. ధరలు పెంచిన ట్రావెల్స్‌పై కేసు నమోదు చేసి బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో 19 మంది మోటార్ వాహన తనిఖీ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు టాక్స్ చెల్లించకపోవడం, పర్మిట్లు లేకుండా బస్సులు తిప్పడం, అనుమతులు లేకుండా కూడా సరుకు రవాణా చేస్తే కేసులు నమోదుచేస్తామన్నారు. రెండో డ్రైవర్ లేకుండా బస్సులను నడపడం, బస్సుల్లో సరుకు రవాణా చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో 190 ప్రైవేటు బస్సులపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించినా చర్యలు తప్పవన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): రోడ్డుపై పడి గాయాలైన లంకలపల్లి లక్ష్మీనారాయణ (70) ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త రాజీవ్‌నగర్‌లో ఉంటున్న లక్ష్మీనారాయణ శుక్రవారం ఆయుర్వేద ఆసుపత్రి ఎదురు రోడ్డుపై పడిపోగా అతని తలకు, కుడిచేతికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ చనిపోయినట్టు మృతుని కుమారుడు శ్రీను పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు.